ప్రజాశక్తి
శుక్రవారం 22 మార్చి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఎవరి ధీమా వారిది..!



◆ సంక్షేమ పథకాలే గట్టెక్కిస్తాయని వైసిపి నమ్మకం
◆ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత కలిసొస్తుందని 'కూటమి'లో విశ్వాసం
◆ ప్రధాన పార్టీల్లో కానరాని 'ప్రజా అజెండా'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రానున్న ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన పార్టీల నేతలు ఎవరి ధీమాలో వారున్నారు. ప్రజల్లోనూ పార్టీల విజయం పట్ల తీవ్ర చర్చ నడుస్తోంది. ఐదేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి చూసి జనం ఓట్లేస్తారన్న ధీమాతో వైసిపి ఉంటే, ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత ఈసారి గెలిపిస్తుందన్న నమ్మకంతో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఉంది. బిజెపి 'కేంద్ర' అండతో నెగ్గుకు వస్తామంటూ కూటమి నేతలు ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను ప్రధాన పార్టీలన్నీ తమ వ్యక్తిగత బలాబలాలు, ఇతర ప్రలోభాల చుట్టే తిప్పుతున్నాయి మినహాయిస్తే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాము సిద్ధం అంటూ బాహాటంగా ఎక్కడా ప్రకటించడం లేదు.

ప్రజల అజెండా తెరపైకి రాకుండా...

విశాఖపట్నంకు రైల్వేజోన్ సాధిస్తామనిగానీ, స్టీల్‌ప్లాంట్ రక్షణకు అండగా నిలుస్తామనిగానీ, ఉత్తరాంధ్ర ప్రాంతానికి సుజల స్రవంతి తెస్తామనిగానీ ప్రధాన పార్టీల అజెండాలో లేదు. ఈ ప్రాంత ప్రజాసమస్యలు తెరమీదకి రాకుండా చేయడం, డబ్బుతో ఓట్లకు గాలం వేయడం అనే అంశంపైనే ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. విశాఖ నగరానికి 2014-19 మధ్య కాలంలో ఏలేరు ద్వారా తాగునీటిని తెచ్చేందుకు రూ.8 వేల కోట్లతో ప్రభుత్వ పథకం రూపొందించినా నాడు చంద్రబాబు, నేడు జగన్ ఆచరణలో పెట్టలేదు. తాగునీటి సమస్యను పూర్తిగా గాలికొదిలేశారు. నగరంలోని ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి కొత్తగా నిర్మాణం కావాల్సి ఉన్న హనుమంతవాక, ఇసుకతోట, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం వంటి ఏడు చోట్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జిలనూ పట్టించుకోలేదు. ఆ రెండు ప్రభుత్వాలు. మెట్రో రైలంటూ ఊదరగొట్టినా దానికీ అతీగతి లేదు. అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. వైసిపి సంక్షేమాన్ని తొలుత అన్నీ ఉచితాలేనంటూ విమర్శలు చేసిన టిడిపి, జనసేన కూటమి తాజాగా ఉచితాలు తామూ వస్తే ఇస్తామంటూ ఎన్నికల్లో జనాలను మోసం చేస్తున్నాయంటూ గురువారం విశాఖలో ప్రాంతీయ వైసిపి నేతల సమావేశంలో ఆ పార్టీ నాయకుడు వైవి.సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. 2014-2019 మధ్య పాలనలో టిడిపి అధినేత చంద్రబాబు ఈ రాష్ట్రానికి, విశాఖకు తీరని ద్రోహం చేశాడంటూ సుబ్బారెడ్డి ఎద్దేవా చేశారు. కాగా, కూటమిని, కూటమి 2024 ఎన్నికల హామీలను చూసి వైసిపి అదిరి పడుతుందంటూ టిడిపి నేతలు ఇప్పటికే విశాఖలోని పలుచోట్ల ప్రచారంలో పెడుతున్నారు. అయితే కూటమి ఆధ్వర్యాన భారీ సభలు జిల్లాలో ఎక్కడా ఇంతవరకూ నిర్వహించలేకపోయారన్న విమర్శలు సొంత పార్టీ శ్రేణుల మిగతా 2లో..



పోర్టు కంటైనర్ టెర్మినల్

పోర్టులో డ్రగ్స్ కలకలం

◆ బ్రెజిల్‌లోని శాంతోస్ పోర్టు నుంచి మిరియాల పేరిట రవాణా
◆ ఇంటర్‌పోల్ సమాచారంతో రంగంలోకి సిబిఐ
◆ 25 వేల కిలోలు సీజ్

విశాఖ పోర్టులో డ్రగ్స్ అక్రమ రవాణా గుట్టును సిబిఐ, కస్టమ్స్ అధికారులు రట్టు చేశారు. బ్రెజిల్ నుంచి విశాఖకు మిరియాల పేరిట ఈ అక్రమ మాదక ద్రవ్యాల రవాణా కంటైనర్‌లో జరిగినట్టు సమాచారం. ఢిల్లీ నుంచి సమాచారం అందుకున్న సిబిఐ, కస్టమ్స్ అధికారులు గురువారం రంగంలోకి దిగారు. 'ఆపరేషన్ గరుడ' పేరుతో ఈ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 25 ప్యాకెట్లుండగా, ఒక్కో ప్యాకెట్‌లో వెయ్యి కేజీల చొప్పన మొత్తంగా 25 వేల కిలోల డ్రగ్స్ విశాఖ ఓడరేవుకు వచ్చినట్లు సిబిఐ తన నివేదికను గురువారం సాయంత్రం విడుదల చేసింది. పెద్దమొత్తంలో డ్రగ్స్ పట్టుబడటంతో విశాఖలో కలకలం రేగింది.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

డిఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

▶ వార్త 2లో..

నాలుగో రోజుకు ఉబర్ డ్రైవర్ల సమ్మె

▶ వార్త 2లో..

ప్రాధాన్యతా రంగాలపై బ్యాంకులు దృష్టి పెట్టాలి

▶ వార్త 5లో..

విద్యుత్ బకాయి పేరిట

స్టీల్‌ప్లాంట్‌ను మూసేస్తారా ?

ఉక్కుపై ప్రభుత్వ తీరు పట్ల మండిపడుతున్న కార్మికవర్గం



దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం

విద్యుత్ బకాయి పేరిట వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను మూసేస్తారా ? లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కర్మాగారంపై ఎందుకింత కక్ష ? అంటూ ప్రభుత్వాల తీరుపై ఉక్కు కార్మికవర్గం మండిపడుతోంది. దశాబ్దాల కలను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపహాస్యం చేస్తున్నాయని వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1134వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో వైర్డ్ మిల్ విభాగం, అడ్మిన్ బిల్డింగ్, టౌన్ అడ్మిన్, ట్రెనింగ్ సెంటర్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె. అయోధ్యరాం, శ్రీనివాస్ మాట్లాడారు. ఎపి గ్రోత్ ఇంజిన్‌గా స్టీల్‌ప్లాంట్‌ను పేర్కొంటున్న ఈ ప్రభుత్వం ప్లాంట్‌ను సహజ మరణం దిశగా తీసుకు వెళు ...న్న కేంద్ర మిగతా 2లో..

ఎన్నికల విధుల నుంచి

ఎవరికీ మినహాయింపు లేదు

◆ విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున
◆ ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని హెచ్‌ఒడిలకు ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినిహాయింపు లేదని, అన్ని శాఖల పరిధిలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది వివరాలను కచ్చితంగా జిల్లా యంత్రాంగానికి నివేదించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆయా శాఖల అధిపతులను ఆదేశించారు. అత్యవసర సేవల్లో నిమగ్నమయ్యే వారు తప్ప మిగిలిన వారందరూ ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. పోల్ మేనేజ్‌మెంట్, సిబ్బంది కేటాయింపు ఇతర అంశాలపై చర్చించే నిమిత్తం గురువారం జిల్లాలోని అన్ని శాఖల అధిపతులతో కలెక్టరేట్ విసి హాలులో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు అంశాలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు. ఆయా శాఖల పరిధిలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది వివరాలను నిర్ణీత కాలంలోగా అందజేయాలని, ఇదివరకు ఇచ్చిన డేటాలో మార్పులు, చేర్పులు ఉంటే ముందుగా తెలియజేయాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా సాగేందుకు అందరూ సహకారం అందించాలని, సమష్టి కృషి చేయాలని అన్నారు. అత్యవసర సేవల్లో ఉండే సిబ్బందికి మాత్రమే మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు సరిపడా సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నాటికి వివరాలను అత్యంత కచ్చితంగా సమర్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఎవరి ధీమా వారిది..!

నుంచే నగరంలో వినిపిస్తున్నాయి. ప్రజల్లో జగన్ పాలనపై వ్యతిరేకతే తమకు ఓట్లు రాలుస్తుందని, ఏ సభలూ, సమావేశాలూ ఏర్పాటు చేయాల్సిన పని లేదని టిడిపి, జనసేన నాయకులు ధీమా వ్యక్తం చేయడం తాజా పరిణామం.

స్టీల్‌ప్లాంట్‌ను మూసేస్తారా ?

ప్రభుత్వాన్ని ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించలేదని ప్లాంటును అంధకారంలోకి నెట్టేయాలని చూడటం దారుణమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, కామేశ్వరరావు, డేవిడ్, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, విల్లా రామ్మోహన్ కుమార్, గుమ్మడి నరేంద్ర పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్

డిఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు ఆధ్వర్యాన నాలుగో డిఆర్ఎం కప్ ఆల్ ఇండియా ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను విశాఖలోని వాల్తేరు డివిజన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. టోర్నీలో పాల్గొనే జట్లను అభినందించారు. టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన జట్లు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించాలన్నారు. ఈవెంట్‌లో 8 జట్లు పాల్గొంటాయన్నారు. ఈ నెల 24 వరకూ సాగే ఈ టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.అవినాష్ పాల్గొన్నారు.

హ్యాండ్ టు హ్యాండ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హ్యాండ్ టు హ్యాండ్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశాఖ నగరంలోని హోటల్ గ్రీన్ పార్కు, వాల్తేరు మెయిన్ రోడ్డు వద్ద గురువారం ప్రారంభమైంది. ఈ నెల 25 వరకూ కొనసాగనుంది. ఉగాది పండగ, వివాహ సీజన్ సందర్భంగా ఆచార వ్యవహారాలకు, సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే విస్తృత శ్రేణి వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఎన్నో రకాల చీరలు, సల్వార్‌లు, టాప్స్, లెనిన్ వస్త్రాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. పోచంపల్లి, కలంకారి చీరలు నుంచి సాంప్రదాయ కోల్‌కతా భాగల్ పురి ప్రింట్ చీరలు, లక్నో చికాన్ వర్క్ చీరలు, బనారస్ పట్టు చీరలు చేనేతలు, రంగులు అద్దినవి, ప్రింట్లు, ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి. బెడ్ షీట్లు, రాజస్థాన్ చీరలు, తలపాగాలు పలు రంగులలో అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకూ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



చీరను ప్రదర్శిస్తున్న మహిళ



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

జిఎస్‌టి రద్దుకు ఆటోడ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆటోలపై విధిస్తున్న జిఎస్‌టిని వెంటనే రద్దు చేయాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్షులు కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉబర్ డ్రైవర్లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి రైడ్‌పై విధిస్తున్న జిఎస్‌టిని రద్దు చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్‌లో ఆటోలకు పికప్ పాయింట్ సపరేట్‌గా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, ఆటో రిక్షా కార్మిక సంఘం నాయకులు గుడాల అప్పారావు, ఉబర్ ఆటో యూనియన్ నాయకులు కె.ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రచారానికి రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతి తప్పనిసరి

సిపి రవిశంకర్



మాట్లాడుతున్న సిపి రవిశంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతి తప్పనిసరి అని, సువిధ యాప్ ద్వారా అనుమతి కోరినప్పటికీ దానికి సంబంధిత నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ద్వారానే అనుమతి ఇవ్వనున్నామని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తెలిపారు. గురువారం ఉదయం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన, ఇతర ఫిర్యాదులను సి విజిల్ యాప్, సువిధ యాప్, డయల్ 100, 112ల ద్వారా తీసుకుంటామన్నారు. అలాకాని పక్షంలో నేరుగా రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను రిటర్నింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలోని మొబైల్ కోడ్ కండక్ట్ (ఎంసిసి) బృందాలు విచారించి నివేదిక ఇచ్చిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి కేంద్ర ఎన్నికల కమిషన్ వంద నిమిషాల డెడ్ లైన్ విధించిందని తెలిపారు. నగరంలో ఇప్పటికే 63 మొబైల్ కోడ్ కండక్ట్ (ఎంసిసి) బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పార్టీ కార్యాలయాలు పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్ల దూరంలో ఉండాలని ఆయన సూచించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు 5 స్టాటిక్ సర్వైలెన్స్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఎన్నికల భద్రత కోసం రెండు సిఐఎస్ఎఫ్, ఒక సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ బలగాలు నగరానికి చేరుకున్నాయని తెలిపారు. అదేవిధంగా మీడియా సెల్ మోనిటరింగ్ సెంటర్ (ఎంసిఎంసి) ద్వారా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, పోస్టులపై పూర్తి నిఘా ఉంటుందని తెలిపారు. ఏదైనా ప్రకటనగానీ లేదా పోస్ట్‌గానీ పెట్టేముందు దానిపై స్పష్టత ఉంటేనే పెట్టాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తిగత దాడులకు పాల్పడవద్దని, కుల, మత సామాజిక తరగతుల మధ్య గొడవలు పెట్టే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు.విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలో 728 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉన్నాయని, వాటన్నిటిని ఆయా స్టేషన్లలో డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో పలువురు నాటు తుపాకులు కలిగి ఉన్నారని సమాచారం తమకు ఉందని, వాటిని కూడా డిపాజిట్ చేస్తామని కమిషనర్ తెలిపారు. సి విజిల్, డయల్ 100, 112లకు ఫిర్యాదు చేసేవారు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని, తప్పుడు ఫిర్యాదులు చేస్తే ఐపిసి సెక్షన్ 182 ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీడియా సమావేశంలో జాయింట్ కమిషనర్ ఫకీరప్ప , డిసిపి-1 మణికంఠ, డిసిపి-2 మూర్తి పాల్గొన్నారు.

నాలుగో రోజుకు ఉబర్ డ్రైవర్ల సమ్మె



బంద్‌తో నిలిచిన ఉబర్ వాహనాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విశాఖలో ఉబర్ డ్రైవర్లు చేపట్టిన సమ్మె గురువారానికి నాలుగో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఉబర్ వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. 'ఉబర్ వాహనాల బంద్' అంటూ ముద్రించిన పోస్టర్లను వాహనాలకు అతికించారు. ఉబర్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్, అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసులు, నాయకులు కె.పోలినాయుడు సమ్మెకు నాయకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లకు ఉబర్ గతంలో ఇచ్చిన రేట్లు తగ్గించకూడదన్నారు. చట్ట ప్రకారం అదనపు కమీషన్ తీసుకోరాదన్నారు. ఉబర్ ప్లాట్‌ఫామ్ ఫీస్ 39 తీసివేయాలని, తగ్గించిన రేట్లు పెంచాలని, వే బిల్లు చూపించాలని, నెగిటివ్ బ్యాలెన్స్ రూ.1000కు మించి ఉండాలని డిమాండ్ చేశారు. నైట్ ఫెయిర్స్‌కు సంబంధించి రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు 50 శాతం ఇవ్వాలని, ఉబర్ ఇంటర్సిటీ రేట్లు పెంచాలని కోరారు. డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మెను విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆనంద్, శ్రీనివాసులు, అబ్బాయి, మనోహర్, రామ్మోహన్, సిమ్మ శ్రీను, నాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా న్యూ పిజ్జా హట్ మెల్ట్స్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిజ్జా బ్రాండ్ కొత్తగా ప్రవేశపెట్టిన పిజ్జా హట్ అన్ని తరగతుల వారికీ మంచి రుచులు అందించనుందని పిజ్జా హట్ ఇండియన్ సబ్ కాంటినెంట్ డైరెక్టర్ మెర్రిల్ పెరేరా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మెల్ట్స్ అనేది భిన్నమైన, సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన భోజన ఎంపిక అన్నారు. ఇది వినియోగదారుల బిజీ జీవనశైలికి అనుగుణంగా ఉంటూ, ఎప్పుడైనా ఎక్కడైనా తినడానికి అనువైనదని తెలిపారు. భారతీయ రుచి ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆరు ఆనందకరమైన మెల్ట్స్ వేరియంట్‌లు అందిస్తోందన్నారు.

వైసిపి దక్షిణ పరిశీలకునిగా శ్రీ వాత్సవ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసిపి పరిశీలకునిగా ద్రోణంరాజు శ్రీ వాత్సవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బాధ్యతను తనకు అప్పగించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల పరిశీలకులు వైవి సుబ్బారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. శ్రీవాత్సవ్ మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు కుమారుడన్న విషయం తెలిసిందే.

ఎన్నికల ముంగిట ప్రచార ఆర్భాటం

సౌకర్యాల కల్పనలో లేదు సంకల్పం

రైతు బజారు అట్టహాసంగా ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పాత మీ సేవా కేంద్రం సమీపంలో ఎట్టకేలకు నిర్మించిన రైతు బజారు ఇటీవలనే ప్రారంభానికి నోచుకుంది. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గత నెలలో ప్రారంభించారు. ఏళ్ల నాటి కళ నిజమైందని నియోజకవర్గ ప్రాంత రైతులు ఎంతగానో ఆశ పడ్డారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని, దళారీల బెడద ఉండదని, పంటపై పెట్టిన పెట్టుబడి వస్తుందని రైతాంగం ఆశించింది. ఇలా ఆశించడం సహజం కూడా. అయితే అందుకు అనుగుణంగానే ఇక్కడ రైతు బజారు ఏర్పాటు చేస్తామని ప్రతి సార్వత్రిక ఎన్నికల్లో నినాదంగా మారింది.

ఈ నేపథ్యంలో గత టిడిపి ప్రభుత్వ హయాంలో స్థలాన్ని ఎంపిక చేశారు. సంబంధిత స్థలాన్ని జివిఎంసి అధికారులు, మార్కెటింగ్ శాఖకు అప్పగించేందుకు కొంత జాప్యం జరిగింది. ఈ లోగా 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. అప్పటి నుంచి సాగుతూ వస్తున్న రైతు బజారు నిర్మాణం 2024 ఫిబ్రవరిలో పూర్తయింది. ముంగిట్లో ఎన్నికలు ఉన్నాయని భావించినట్టు ఉంది. ఆఘ మేఘాల మీద దుకాణాలు, ప్రహరీ నిర్మించేశారు. తాగు నీరు, విద్యుత్ ఇతర్రతా మౌలిక సదుపాయాలు లేనే లేవని రైతులు అంటున్నారు. పంట నిల్వ ఉంచేందుకు సరిపడా శీతల స్టోరేజీ నిర్మాణం లేదని అంటున్నారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చాం, రైతు బజారు నిర్మించేశాం అని చెప్పుకునేందుకు తప్పితే, మౌలిక సదుపాయాలు లేకుండా ఉన్న రైతు బజారు వల్ల ఏమి ఉపయోగం అని పలువురు రైతులు అంటున్నారు.

భీమిలి నియోజకవర్గానికి వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో రైతు బజారు ఏర్పాటు ఎంతైనా అవసరమే. ఎందుకంటే తగరపువలసకు చుట్టు పక్కల ఉన్న పలు గ్రామాల్లో అరటి, టమోటా, క్యాబేజీ, వంకాయలు, బెండ, దొండ తదితర కూరగాయలు, బంతి, చామంతి పూల తోటలు పండిస్తున్నారు. వీటిని అమ్మేందుకు స్థానికంగా ఉన్న ప్రైవేట్ మార్కెట్‌కు వస్తుంటారు. ఇక్కడ దళారులదే రాజ్యం అన్నట్టుగా కొంత మంది వ్యాపారులు కలిసి తక్కువ ధరకు కొని మార్కెట్‌లో ఉన్న వ్యాపారులకు అమ్ముతుంటారు. ఇక్కడ చెప్పాల్సింది ఏమంటే.. పంటపై పెట్టుబడి పెట్టిన రైతుకు ఒక్కో సారి పెట్టుబడి కూడా రాని దయనీయ పరిస్థితి ఉంటోంది. పంట పండించిన రైతుకు, కూరగాయలు అమ్మే వ్యాపారులకు ఆర్థిక పరమైన ప్రయోజనాలు తక్కువని, ఇరువురికి మధ్య ఉన్న దళారీనే లాభపడుతున్నాడని పలువురు రైతులు అభిప్రాయ పడుతున్నారు.



అరకొర సౌకర్యాలతో ఇటీవల ప్రారంభించిన రైతు బజార్

సౌకర్యాలు కల్పించాలి

రైతు బజారు నిర్మాణం ఉపయోగమే. అయితే సరిపడా సదుపాయాలు కల్పించి ఉంటే బాగుండేది. ప్రహరీ, కొన్ని దుకాణాలు కడితే రైతు బజారు ఏర్పాటు చేసినట్టు కాదు.



వై.అప్పలనాయుడు
మజ్జిపేట, భీమిలి మండలం

వేగంగా వినియోగంలోకి...

నిర్మించిన రైతు బజారు వేగంగా వినియోగంలోకి తేవాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. పండించిన పంట నిల్వ ఉంచేందుకు వీలుగా సదుపాయాలు కల్పించాలి.



ఎం.సింహాద్రి, రైతు
లింగన్నపేట
పద్మనాభం మండలం

ఘనంగా అనంతుని కల్యాణం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం గ్రామంలో శ్రీ అనంతపద్మనాభ స్వామి వార్షిక తిరు కళ్యాణ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అనంత పద్మనాభ స్వామి కొండ దిగువన ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయం ప్రాంగణంలో కల్యాణ వేదికపై శ్రీదేవిభూదేవి సమేతుడైన అనంత పద్మనాభ స్వామికి ఈవో నానాజీబాబు ఆధ్వర్యాన అర్చకులు కల్యాణ వైభోగం నిర్వహించారు. కల్యాణ వేదికపై ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. ఎంపిపి రాంబాబు, పద్మనాభం సర్పంచ్ టి.పావ దంపతులు పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. బహుళ పాడ్యమి మంగళవారం వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గీతంలో సాంకేతిక యువజనోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం (ఇఇసిఇ), ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఇటిఇ) సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్పైర్ ఆర్-2024 గురువారం ప్రారంభమైంది. ప్రముఖ సైంటిస్ట్ - ఎఫ్ ఎన్ఎస్ఈఎల్ వివేక్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సమకాలీన సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్. రాఘవచేతన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.భరణిచంద్ర కుమార్, ఐ స్పైర్ ఆర్ కన్వీనర్ సెవెన్ లైన్, ఫ్యాకల్టీ సలహదారులు డాక్టర్ పి.రాజు, ఎన్‌వివిఎస్.విజయకుమార్, డాక్టర్ ఎస్.శారద రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ఇంజినీరింగ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. నూతన సాంకేతిక అంశాలపై వర్క్‌షాపుతో పాటు నిపుణుల ప్రసంగాలు, పేపర్ ప్రెజెంటేషన్, టెక్ఎక్స్‌పో, ఆర్ఎక్స్‌పో రోబోరేస్ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్లు తెలిపారు.

ఓటు యువత చేతిలో ఆయుధం

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్




యువ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : యువతరం తమ భవిష్యత్తును, దేశ ప్రగతికి సంబంధించిన ఆకాంక్షలను నిర్దేశించాలంటే ఓటు హక్కును ఉపయోగించుకోవాలని, ముఖ్యంగా ఓటు అనే ఆయుధాన్ని బాధ్యతతో రానున్న ఎన్నికలలో వినియోగించుకోవాలని గీతం అధ్యక్షుడు ఎమ్. శ్రీభరత్ పిలుపునిచ్చారు. భారత పరిశ్రమల సమాఖ్య అనుబంధ విభాగం యంగ్ ఇండియన్స్ గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యువ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, విధిగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుగా యువత తమ వంతు బాధ్యతను గుర్తెరిగి తమ ఆకాంక్షలను నెరవేర్చే నాయకులను అధికారంలోకి తీసుకురావాలని చెప్పారు. వివిధ కారణాలను చూపి ఓటు హక్కును వినియోగించుకోకపోవడం, ఓటింగ్‌కు దూరంగా ఉండటం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో, కేంద్రంలో చట్ట సభలు వాటికి గల అధికారాలను కొత్త ఓటర్లకు వివరించారు. 2024 సంవత్సరంలో యువత భాగస్వామ్యంతో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగగలవన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. యంగ్ ఇండియన్స్ ప్రతినిధి ఉప్పలపాటి రాణా మాట్లాడుతూ దేశంలో అధిక శాతం మంది ఓటింగ్‌కు దూరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో సిఐఐ యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు సంజన, సుమేధ్, నివేదిత, ఆదర్శ్, రోహిత్, గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతిన ప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం ప్రాంతానికి చెందిన వైసిపి నాయకులు, అనూష కేటరింగ్ అధినేత పోతిన ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పిఎం.పాలెం, ఆర్‌హెచ్ కాలనీ, లక్ష్మీవానిపాలెం, బిటూ కాలనీ, గాయత్రి నగర్ ప్రాంతాలకు చెందిన పోతిన ప్రసాద్ అభిమానులు 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సంస్థ ప్రశంస పత్రాలను పోతిన ప్రసాద్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా పోతిన ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి ఏటా తన పుట్టిన రోజున అభిమానులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పోతిన ప్రసాద్‌కు ఆయన అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



పోతిన ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

నేరాలు ఘోరాలు

శారదానదిలో మునిగి యువకుడు మృతి

ప్రాణాలతో బయటపడ్డ మరో వ్యక్తి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోవాడ గ్రామం వద్ద శారదానది వంతెన దిగువన నీటిలో మునిగి ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి చావు నుంచి బయట పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... విశాఖ జిల్లా గాజువాక దరి దయాల్‌నగర్‌కు చెందిన పెంటకోట యుగంధర్ (26), బీశెట్టి రామకృష్ణ గురువారం మాడుగులలో ఫంక్షన్ నిమిత్తం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గోవాడ వద్ద శారదానది వంతెన దిగువన నీటిలో స్నానం చేసేందుకు దిగారు. స్నానం చేస్తుండగా యుగంధర్ నీటిలో మునిగిపోయాడు. యుగంధర్‌ను రక్షించేందుకు నీటిలో దిగిన బీశెట్టి రామకృష్ణ కూడా మునిగిపోతుండంతో ఆయన పెద్దగా కేకలు వేశాడు. దీంతో స్థానికులు చూసి రామకృష్ణను రక్షించి హుటాహుటిన చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యుగంధర్ మృతదేహాన్ని స్థానికులు అగ్ని మాపక సిబ్బంది సహాయంతో బయటకు తీశారు. స్థానిక సిఐ బి.శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

20 లీటర్ల నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలంలోని ఏటిగైరంపేట గ్రామ పంచాయతీ శివారు సీతకండిలో నాటు సారా శిబిరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ రేల్లలపాలెం గ్రామానికి చెందిన దూరి బోడేసును అరెస్టు చేసినట్లు తెలిపారు.

పెండ్లి కుమార్తె కారు బోల్తా

8 మందికి గాయాలు

ప్రజాశక్తి- ఆనందపురం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి సొంట్యాం ఎన్ఎస్ఆర్‌ఐటి కళాశాల సమీపంలో రహదారిపై పెండ్లి కుమార్తె కారు బోల్తా పడిన ఘటనలో 8 మందికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... విజయవాడకు చెందిన పోతల వీరబాబు కుటుంబం శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం గూడూరులో గురువారం జరగబోయే వివాహానికి హాజరయ్యేందుకు తమ సొంత కారులో బయలుదేరారు. ఈ కారులో తన చెల్లి రాజేశ్వరి కుటుంబ సభ్యులను తీసుకుని వస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సొంట్యాం వద్దకు వచ్చేసరికి కారు వెనక టైరు పంచర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పెళ్లి కుమార్తె రాజేశ్వరితో పాటు మరో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో తగరపువలస వద్ద గల ఎన్ఆర్‌ఐ హాస్పటల్‌కు తరలించి ప్రాథమిక చికిత్స అందజేశారు. ఎవరికీ ప్రాణహాని లేదని పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న పలువురిని పిఎం.పాలెం పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... మధురవాడ ఎండాడ ప్రాంతానికి చెందిన రమణరి సాయికృష్ణ, అక్కబోయిన సాయికుమార్, పోతిన వెంకటేష్, బొక్కం హేమంత్, బొద్దం రాము, వెంకీ సంతోష్ కలిసి మారికివలస సమీపంలోని ఆదిత్య కాలేజ్ వెనుక భాగంలో అనుమానంగా తిరుగుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారి నుంచి సుమారు 5 కిలోల గంజాయిని, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. వారిని మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించినట్లు సిఐ చెప్పారు.

22న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పాత పరదేశిపాలెం 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్ 3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి

గడపగడపకూ ప్రచారం...

ప్రజాశక్తి -మధురవాడ : ఎన్నికల నేపథ్యంలో మరోసారి గడపగడపకు వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని వైసిపి నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం పార్లమెంట్ పరిధిలో ఉన్న ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఐదేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, మేయర్ హరి వెంకట కుమారి పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై మహిళలు దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి -ములగాడ : మహిళలు చేతివృత్తులకు ప్రాధాన్యతనిస్తూ స్వయం ఉపాధిని సాధించాలని, హస్త కళలను సజీవంగా పోషించాలని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1, 2 ఆధ్వర్యాన ఇందిరాకాలనీ, బర్మాకాలనీల్లో ప్రత్యేక సేవా శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, ప్రతి మహిళా ఏదో ఒక వృత్తి నైపుణ్యాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం కాగితాలతో పువ్వులను, బొకేలను తయారుచేయడంలో వాలంటీర్లకు, స్థానిక మహిళలకు శిక్షణ ఇచ్చారు. అంతా కలిసి దాదాపు 200 పువ్వులను తయారుచేశారు. ఈ కార్యక్రమంలో తయారుచేసిన బొకేలను, పువ్వులను స్థానిక పాఠశాలలలో పంపిణీ చేశారు. అనంతరం ఆదర్శ గ్రామం అంశంపై వాలంటీర్లకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. సాయంత్రం జరిగిన సమావేశంలో పర్యావరణ పరిరక్షణ, చెత్త సేకరణపై ప్రత్యేక చర్చ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాల్లో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఐపిఎస్.భాగ్యలక్ష్మి, నదియా, వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.


అనంతవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అనంతవరంలో ముత్తంశెట్టి ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అనంతవరం, పెంట గ్రామాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, అనంతవరం సర్పంచ్ జి.లక్ష్మినాయుడు. స్థానిక నాయకులు రవి, సత్యనారాయణ, ఆదిబాబు, ఈశ్వరరావు, జీవీకే వర్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలు పట్టని అధికారులు'

ప్రజాశక్తి-పెందుర్తి : వైసిపి నాయకులు చెప్పినట్లు నడవడం తప్ప ప్రజా సమస్యలు అధికారులకు పట్టడం లేదని జనసేన నాయకులు గల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. జివిఎంసి 88వ వార్డు గవర జగ్గయ్యపాలెంలో గురువారం జనసేన నాయకులు పర్యటించారు. ఇళ్ల మధ్యలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇళ్ల మధ్యల్లో నీరు నిల్వ చేరుతోందని ఆరోపించారు. అవుట్ లెట్ లేకున్నా కాలువల నిర్మాణాలు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఇళ్ల మధ్యలో మురుగు నీరు చేరడంతో దోమలు పెరిగి స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు.

హడావిడి ప్రారంభాలు

మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారుల్లో నిరాశ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభపురంలో సుమారు 846 టిడ్కో గృహాలను నిర్మించారు. ఎన్నికల కోడ్ రావడానికి రెండు రోజులు ముందు వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ హడావిడిగా ప్రారంభించారు. గత టిడిపి హయాంలో ఇచ్చిన ఈ ఇళ్లు ఇప్పటికైనా పూర్తయి తాము గృహప్రవేశాలు చేసుకుంటామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. వారి ఆనందం ఎంతో సమయం నిలబడలేదు. ఎక్కడి పనులు అక్కడే ఉండిపోవడంతో ఎవరూ గృహాల్లో దిగేందుకు సుముఖత చూపడంలేదు. పనులన్నీ పూర్తి కావడానికి కనీసం ఒక మూడు నెలలు పడుతుందని అధికారులు చెబుతున్నారు. మరో మూడు నెలలు అద్దెల భారం తప్పదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల కోసమేనా ఈ హడావిడి అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి హయాంలో నిర్మించిన ఈ ఇళ్లను ఇప్పటి వరకు వదిలేయడం వల్ల చాలా వరకు తలుపులు పాడయ్యాయని లబ్ధిదారులు చెబుతున్నారు. ఎన్నికలు రావడంతో అధికారులు ఆ పనిలో ఉన్నారని, ఇళ్లలో దిగేందుకు ఆగస్టు దాటుతుందేమోనని లబ్ధిదారులు చర్చించుకుంటున్నారు.


పద్మనాభపురంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

జూ పార్కులో ఫారెస్ట్ ఎక్స్‌పో


అటవీ ఉత్పత్తులను చూస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, కోస్టల్ ఎకో సిస్టమ్ సెంటర్, ఈస్టర్న్ ఘాట్స్ బయోడైవర్సిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యాన జూ పార్కులో గురువారం ఫారెస్ట్ ఎక్స్‌పోను ఏర్పాటుచేశారు. దీనిలో భాగంగా వివిధ రకాల విత్తనాలు, మడ అడవుల జాతుల మొక్కలు, సహజ సిద్ధంగా తయారుచేసిన ఎకో ఫ్రెండ్లీ మొక్కల కుండీలు, నేచురల్ కలర్ బ్లాక్ ప్రింట్ తదితరాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ, అడవులు, వివిధ రకాల విత్తనాల వైవిధ్యం, మడ అడవుల పర్యావరణ వ్యవస్థలు, అటవీ ఉత్పత్తులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అటవీ పర్యావరణ వ్యవస్థలు, తీర ప్రాంత రక్షణలో మడ అడవుల ప్రాముఖ్యత, వాటిని పరిరక్షించాల్సిన ఆవశ్యకత అర్థం అయ్యేలా సందర్శకులకు, విద్యార్థులకు వివరించారు. అడవులను రక్షించడం, రాబోయే తరానికి ప్రకృతితో కూడిన మంచి భవిష్యత్తును అందించడం పట్ల ప్రతి వ్యక్తికీ గల బాధ్యతను గుర్తు చేయడమే లక్ష్యమన్నారు. సందర్శకులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శన ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపాలనాయుడు, గోపి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేశ్వరరావు, జూ ఎడ్యుకేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

మదిలో భావాలకు అక్షర రూపం కవిత

డైట్ వైస్ ప్రిన్సిపల్ మాణిక్యంనాయుడు

ప్రజాశక్తి - భీమునిపట్నం : మదిలో భావాలకు అక్షరరూపం కవిత అని స్థానిక ప్రభుత్వ డైట్ వైస్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ డైట్‌లో గురువారం ప్రపంచ కవిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కవితా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. సమాచార స్రవంతి, ఈ మాస పత్రిక సంపాదకులు గొట్టేటి రవి మాట్లాడుతూ, కష్టంలోనూ, సుఖంలోనూ పైకి చెప్పుకోలేని భావాలు మనసులో మెదులుతూనే ఉంటాయని, వాటికి అక్షర రూపం ఇస్తే కవితగా మారుతుందని చెప్పారు. విద్యార్థులు కవితలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పలువురు డైట్ సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

'జాతీయ బ్యాంకులతో సమానంగా సేవలు'

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ బ్యాంకులతో సమానంగా కనకమహలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకులో సేవలు అందిస్తున్నారని ఖాతాదారులు కొనియాడారు. బ్యాంకు రజతోత్సవాల్లో భాగంగా బ్యాంకు మధురవాడ శాఖలో గురువారం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. బ్యాంకులో సిబ్బంది అందిస్తున్న సేవల గురించి ఖాతాదారులు పలు సూచనలు, సలహాలు అందించారు. తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ, ఖాతాదారులకు సాంకేతికపరంగా సత్వర సేవలందిస్తున్నామని తెలిపారు. ఖాతాదారుల ఆదరణ పొందుతూ 24 ఏళ్ల పూర్తి చేసుకుని 25వ ఏట అడుగిడినట్లు చెప్పారు. ఇప్పటికే వివిధ జిల్లాలో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనముతో కేవలం 7 మంది సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17350 మంది సభ్యులతో రూ.33 కోట్లు వాటా ధనము పొంది, రూ.1400 కోట్ల వ్యాపారంతో అర్బన్ కో-ఆపరేటివ్ రంగంలోనే ముందంజలో ఉందన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ, పిఎం.పాలెంలో తమ బ్యాంకు ఏర్పాటైన నుంచి ఖాతాదారులు, శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులను బ్యాంకు చైర్మన్ సత్కరించి, మెమెంటోలను అందజేశారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, ఒ.ఎస్‌డి శాస్త్రి, మధురవాడ శాఖ మేనేజరు పి.భానుతేజ పాల్గొన్నారు.


రజతోత్సవంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు, ఖాతాదారులు

గాజువాకలో కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి -గాజువాక : ఎన్నికల నేపథ్యంలో గాజువాక నియోజకవర్గానికి సంబంధించి కంట్రోల్ రూమ్‌ను తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యాన ఏర్పాటుచేశారు. ఎన్నికల ప్రక్రియలో కోడ్ ఉల్లంఘనలు, వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో భాగస్వాములు కావడంపై ఫిర్యాదు చేయుటకు, ఓట్లకు సంబంధించి సందేహాలు, మార్పుల కోసం 08912760025, 855085615 సంప్రదించాలని పేర్కొన్నారు.


నగరంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నగరంలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-సీతమ్మధార: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సీతమ్మధార సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటఅప్పలనాయుడు ఆధ్వర్యాన నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రామ టాకీస్, ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు, గంజాయి తదితరాలు అక్రమంగా తరలించకుండా తనిఖీలు చేపట్టినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు వేణుగోపాల్, మురళినాయుడు పాల్గొన్నారు.

కెకె.రాజుకు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కెకె.రాజును ప్రకటించడంతో ముస్లిం సంఘం నాయకులు, సభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు గురువారం ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో కెకె.రాజుకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన కెకె.రాజు గెలుపునకు కృషిచేస్తామని వారు చెప్పారు.

వైసిపి నియోజకవర్గ పరిశీలకుల నియామకం

ప్రజాశక్తి- సీతమ్మధార, మాధవధార : ఉత్తర నియోజకవర్గం వైసిపి పరిశీలకులుగా చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ వైసిపి పరిశీలకులుగా పేడాడ రమణికుమారి నియమితులయ్యారు. తమపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, వైవి సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాధాన్యతా రంగాలపై బ్యాంకులు దృష్టి పెట్టాలి

కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే బ్యాంకులు ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయం, చిన్నపరిశ్రమలు, స్వల్పకాలిక వ్యవసాయ రుణాలపై మరింత దృష్టి సారించాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలో గురువారం నిర్వహించిన డిసిసి, డిఎల్‌ఆర్‌సి మూడవ త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం ప్రధాన రంగంగా వుందని, కాబట్టి వ్యవసాయ అనుబంధ రంగాలకు స్వల్పకాలిక రుణాలను ఎక్కువగా మంజూరు చేయాలని సూచించారు. తోటలు, కూరగాయలు, పశు సంవర్ధక, డెయిరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూత నివ్వాలని కోరారు. ఆయా శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో వ్యవసాయ, అనుబంధ రంగ రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.5088.12 కోట్లు ఎంఎస్ఎంఈకి రూ.1566.9 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం ఆర్‌బిఐ ఎజియం ఆర్‌కె.హనుమకుమారి వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న రుణాలను సమీక్షించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి పి.నరేష్, నాబార్డ్ డిడియం సమంత్ కుమార్, మెప్మా పిడి ఎన్.సరోజిని, కెవిఐబి ఏడి, వి.పద్మ, ఎపిటిడ్కో డిఈఈ బి.సంధ్య, పశు సంవర్ధక శాఖ టెక్నికల్ అధికారి పి.భానుబాబు, మత్స్యశాఖ డిడి పి.ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకరావు, డిఐసి ఏడి జి.జోగినాథ్, డిసిసిబి సిఈఓ డివియస్ వర్మ, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

వైసిపికి ద్వారపురెడ్డి బాబ్జీ రాజీనామా

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి బాబ్జీ పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత ఎన్నికలలో వైసిపి గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేశానని తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబురాజు గెలిచిన తరువాత తన సొంత ఆస్తులు కూడబెట్టుకోవడానికే పరిమితమయ్యారని, కార్యకర్తలను విస్మరించారని ఆరోపించారు. దీనిపై గతంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, మూడు జిల్లాల సమన్వయకర్త సుబ్బారెడ్డి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించకపోవడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



రాజీనామా పత్రం చూపుతున్న ద్వారపురెడ్డి బాబ్జీ



పైలా ప్రసాదరావుకు స్వాగతం పలుకుతున్న టిడిపి కార్యకర్తలు

గ్రామాల్లో పైలా ప్రసాదరావు ప్రచారం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మాడుగుల నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు గురువారం మండలంలోని గొట్లాం, కింతాడ, సూదివలస, గొండుపాలెం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయనకు టిడిపి శ్రేణులు సాదర స్వాగతం పలుకుతూ అభినందనలు తెలియజేశాయి. ఎన్నికలను సవాలుగా తీసుకుని టిడిపి గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి మట్టి కరవడం ఖాయమని, బూడి ముత్యాల నాయుడు ఓటమికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని బిజెపి మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జ్ మేడపురెడ్డి శ్రీనివాస్ కోరారు. స్థానిక బిజెపి కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ మిత్ర ధర్మం పాటించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కోటాన ఈశ్వరరావు, బర్నికాన అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత భారత్ అభియాన్‌లో

ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల సభ్యత్వం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్‌లో సభ్యత్వం తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలను ఆంధ్ర యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని గురువారం సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సమీపంలో ఉన్న లగిశెట్టిపాలెం, టెక్కలి పాలెం, వంగలి, అంతకాపల్లి, గొర్లివాని పాలెం గ్రామాలను దత్తత తీసుకుని ఆ గ్రామాలలో పర్యటించారు. ఈ గ్రామాలలో ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి కళాశాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు

లోక్‌సత్తా మద్దతు శుభపరిణామం

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన, టిడిపి, బిజెపి కూటమికి లోక్‌సత్తా పార్టీ మద్దతు తెలియజేయడం శుభ పరిణామమని అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జిని రామకృష్ణ సత్కరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ జయప్రకాష్ నారాయణ వంటి వ్యక్తి తమ కూటమిని స్వాగతించటం హర్షణీయమన్నారు. భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొణతాల సేవలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల బాలాబాబు, భరత్‌బాబు, టిడిపి నాయకుడు కర్రి బాబీ, జనసేన నాయకుడు దూలం గోపి, గంజి సత్తారావు, మంగా ఈశ్వర్ పాల్గొన్నారు.

మూట్ కోర్టు పోటీల్లో న్యాయ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సబ్బవరం

మేఘాలయ నేషనల్ లా యూనివర్సిటీ, ఎన్‌హెచ్‌ఆర్‌సి వారు ఈ నెల 15 నుండి 18వ తేదీ వరకు నిర్వహించిన మూట్ కోర్టు పోటీల్లో స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తమ న్యాయ నైపుణ్యాన్ని కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. గురువారం ఆయన ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ తమ వర్సిటీ మొదటి సంవత్సరం విద్యార్థులు అథర్వ్ అర్నవ్, కౌశిక్ శర్మ, అభ్యుదయ్ మిశ్రాలతో కూడిన జట్టు న్యాయ రంగంలో అసాధారణమైన నైపుణ్యం, పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తూ ప్రాథమిక రౌండ్‌లలో అత్యున్నత ర్యాంక్ పొందిన జట్టుగా నిలిచిందని తెలిపారు. తమ విద్యార్థులు వారి వాగ్దాటి, ఒప్పించే వాదనలతో ప్రేక్షకులను, న్యాయనిర్ణేతలను ఆకర్షించి అథర్వ్ అర్నవ్ ఉత్తమ వక్తగా నిలవగా, కౌశిక్ శర్మ రెండవ ఉత్తమ వక్తగా నిలిచారని పేర్కొన్నారు. అభ్యుదయ్ మిశ్రా చేసిన పరిశోధనకు మొదటి బహుమతి లభించిందన్నారు. పిటిషనర్ పక్షం నుండి దాఖలు చేసిన మెమోరియల్‌కు మొదటి బహుమతి లభించిందన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న విసి సూర్యప్రకాశరావు

జనసేన మండల ప్రధాన కార్యదర్శిగా అంజిబాబు

ప్రజాశక్తి- కె.కోటపాడు : జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా చౌడువాడ గ్రామానికి చెందిన కుంచ అంజిబాబు నియమితులయ్యారు. అంజిబాబు జనసేన పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీలో చురుకైన పాత్ర పోషించినందుకు గాను ఆయనకి ఈ పదవి లభించింది. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ తనను మండల జనరల్ సెక్రెటరీగా నియమించిన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు, మాడుగుల నియోజవర్గం ఇన్చార్జి రాయపురెడ్డి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.



పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం-3 అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా తాళ్ళపాలెం పిహెచ్‌సి బోధకులు ఎంఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ ఆకుకూరలు, ఐరన్ చేరే పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఆహార నియమాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. బాలామృతం తయారీపై సెక్టార్ సూపర్ వైజర్ సుచరిత ఆదిలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అన్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు కే ధనలక్ష్మి, అమ్మాజీ, బొర్రమ్మ, రామలక్ష్మి, ఉమా, సత్యవతి, ఆశా కార్యకర్తలు పద్మ, దేవి పాల్గొన్నారు.

మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని చోడవరం పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సిహెచ్.సింహాచలం నాయుడు భార్య లక్ష్మికు గురువారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3,91,920 నగదు చెక్కును తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డు ఎవరైనా విధి నిర్వహణలో మరణించిన, ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను ఆర్థిక సహాయంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి బి.శారద పాల్గొన్నారు.

కొణతాల గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి -కశింకోట : అనకాపల్లి నియోజకవర్గం జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు కృషి చేయాలని ఆయా పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని పేరంటాలపాలెంలో గురువారం మూడు పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, గొంతుని శ్రీనివాసరావు, కాయలు మురళి, పెంటకోట రాము, సిదిరెడ్డి శ్రీను, నైనంశెట్టి రమణరావు, కాంగ్రెసులు సతీష్, జనసేన నాయకులు పావాడ కామరాజు, కర్రి గోవింద, బిజెపి నాయకులు పరమేశ్వరరావు, కరక సత్యనారాయణ పాల్గొన్నారు.

పిచ్చుకల నాశనం ప్రకృతి విపత్తుకు నిదర్శనం

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రకృతిలో పిచ్చుకల నాశనం ప్రకృతి విపత్తుకు నిదర్శనమని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ బి శశిధర్ చేతుల మీదుగా పిచ్చుకలను రక్షించుకుందాం అనే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పిచ్చుకల సంరక్షణ వంటి అంశాలపై గత దశాబ్ద కాలంగా గ్రీన్ క్లబ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఫిజియోథెరపిస్టు డాక్టర్ గణేష్, దంత వైద్య నిపుణులు డాక్టర్ అర్చన, గ్రీన్ క్లబ్ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, కర్రి హనుమంతరావు, చిన్ని స్వామి, శేష సాయి, బొడ్డేడ మురళి, పూర్వపు అటవీశాఖ అధికారి బేరా వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన వైసిపి

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : వైసీపీ ప్రభుత్వం బీసీలను అన్నివిధాలుగా మోసం చేసిందని, ఇప్పుడు వైసీపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మి మరోసారి మోసపోయేందుకు బీసీలు సిద్ధంగా లేరని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కశిరెడ్డి ప్రసాద్ అన్నారు. రాంబిల్లి టిడీపీ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాల్లో జగన్మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు చోటు లేకుండా చేసి తన సొంత సామాజిక తరగతికి కొమ్ముకాశారని ఆరోపించారు. వైసీపీ ఎమ్మెల్యేలను మార్చిన 81 స్థానాల్లో కేవలం 9 స్థానాల్లో మాత్రమే రెడ్డి సామాజిక తరగతికి చెందిన వారిని మార్చారని, బడుగు, బలహీన వర్గాల వారిని 90శాతం మార్చారని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు లాలం తాతబాబు, చోడిపల్లి సత్యనారాయణ, దేముడు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కశింకోట : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సమక్షంలో గురువారం ఏఎస్ పేట గ్రామంలోని ఆయన నివాసం వద్ద కసింకోట మండలం, పల్లపు సోమవారం గ్రామానికి చెందిన రజకుల సంఘం సభ్యులు పలువురు వైసిపిలో చేరారు. వారికి భరత్‌కుమార్ వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో రాము, శివ, శ్రీనుతో ఎనిమిది మంది ఉన్నారు.



వైసిపిలో చేరిన వారితో భరత్ కుమార్



ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఓటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్‌వీఈఈపి, వెలుగు డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటింగ్ నమోదు, ఎన్నికల ప్రక్రియపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ శచీదేవి, ఏరియా కోఆర్డినేటర్ రత్నప్రభ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ యొక్క ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులను ఎనిమిది టీములుగా విభజించి ఓటింగ్, ఎలక్షన్ ప్రక్రియపై క్విజ్, స్లోగన్స్, డిబేట్ వంటి పోటీలు నిర్వహించారు. క్విజ్లో సంతోషి టీమ్, స్లోగన్స్‌లో ఎస్ ప్రవళిక, డిబేట్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు డి మాల్యాద్రి, డాక్టర్ రత్నభారతి, సీనియర్ అధ్యాపకులు ఎస్ఎం రఫుద్దీన్, హెచ్ సుధీర్, డాక్టర్ ఏ కృష్ణారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపర్చాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగు పరచి ప్రజలకు భద్రత, రక్షణ కల్పించాలని డిఎస్‌పి ఎస్.అప్పలరాజుకు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారుల సంఖ్య పెరగడం, ఆటోలు, బస్సులు, హెవీ వెహికల్స్ నిత్యమూ అన్ని ముఖ్య రహదారులలో తిరగడం వలన ట్రాఫిక్ రద్దీ పెరిగిందని తెలిపారు. దీంతో రోడ్లపై నడిచే పాదచారులు, వాహన దారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యముగా వృద్ధులు, మహిళలు, పిల్లలు, విద్యార్థులు రోడ్లపై నడిచి వెళ్లడానికి బిక్కు బిక్కుమంటూ భయపడుతున్నారని తెలిపారు. పట్టణంలోని ముఖ్యమైన రద్దీ జంక్షన్లలో సిగ్నల్ వ్యవస్థలు లేక పోవడంతో అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేశ్ గుప్తా, పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, రొబ్బి చంద్రరావు, పెదిరెడ్ల సుజాత పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తేగాడ, బయ్యవరం గ్రామాల్లో ఐసిఆర్‌పి ఆధ్వర్యంలో ఏపి బయోడైవర్సిటీ బోర్డ్ గుంటూరు వారి సహకారంతో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. శారదవేలీ డెవలప్మెంట్ సమితి సిబ్బంది, అనకాపల్లి ఎఎంఎఎల్ కాలేజీ బిఎస్సి అగ్రికల్చర్ విద్యార్థులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు గురించి వివరించారు. సేంద్రియ ఎరువులు తయారీ, వాటికి కావలసిన ముడి సరుకులు, పిచికారీ పద్ధతి వంటివి స్వయంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు సిహెచ్ నాగరాజు, కన్నయ్య అమ్మ, టి అప్పారావు, ఎల్ లోవరాజు, శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి కోఆర్డినేటర్స్ కోన అప్పారావు, వి చక్రవర్తి పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ వితరణ

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి శివ బాపునాయుడు కుమారుడు శేఖర్ ఫ్యాన్ వితరణ చేశారు. దీనిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావు గురువారం అందజేశారు. వేసవికాలం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఫ్యాన్‌ను ఇస్తున్నట్లు శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి శివ బాపునాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి అనంతరావు, ఉపాధ్యాయులు వై అరుణ కుమారి, శరగడం శేఖర్ పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని మార్టూరు గ్రామంలో గురువారం నూకాంబిక ఆలయంలో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, గ్రామ సర్పంచ్ కేకే రమేష్ బాబు, నూకాంబిక ఆలయ కమిటీ కార్యదర్శి కెవి రమణ, సెక్రటరీ కేకే శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలలో అనుమతులకు సింగిల్ విండో

- రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణం చేయరాదు
- జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి

ప్రజాశక్తి- అనకాపల్లి

పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు వివిధ అనుమతులు పొందేందుకు కలెక్టరు కార్యాలయంలో సింగిల్ విండో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలు, అభ్యర్థుల ప్రచారాలకు సంబంధించిన అనుమతులు పార్లమెంటు, అసెంబ్లీల రిటర్నింగ్ అధికారులు జారీ చేస్తారని చెప్పారు. అనుమతులు ఆన్‌లైన్‌లో (సువిధ) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. హెలికాప్టర్, హెలిప్యాడ్, ఎయిర్ బెలూన్‌లకు జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టరు మాత్రమే అనుమతి ఇస్తారని తెలిపారు. సభలు సమావేశాలు, పార్టీ కార్యాలయం ప్రారంభం, ప్రచార వాహనాలు, ఊరేగింపులు, బారికేడ్ల నిర్మాణాలకు నియోజకవర్గ ఆర్‌ఓ నుండి అనుమతులు పొందాలని సూచించారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీలకు 48 గంటల ముందుగా అనుమతి పొందవలసి వుంటుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో ఎవరైనా రూ.50వేలకు మించి నగదుతో పట్టుబడితే ఆ డబ్బును సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఏ అవసరం నిమిత్తం సొమ్ము తీసుకువెళ్తున్నదీ ముందుగా కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ వద్ద నమోదు చేయించుకోవలసి వుంటుందని చెప్పారు. స్క్వాడ్ తనిఖీ సమయంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ (ఫోన్ నెంబర్ 8688365757)నకు ఫోన్ చేయించవచ్చని వివరించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం పరిశీలకులు డి.రామ్మూర్తి, ఎస్‌ఏ తులసీరామ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు (టిడిపి), కె.హరనాధబాబు (ఆమ్‌ఆద్మీ) తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ దయానిధి

పెందుర్తి టికెట్ బండారుకు కేటాయించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే టికెట్ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం టిడిపి మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా తన జీవితాన్ని పార్టీకే అంకితం చేసి, కష్టకాలంలో కేడర్ చెక్కుచెదరకుండా కాపాడిన బండారుకు టిక్కెట్ ఇవ్వకుంటే పార్టీ మనుగడ కష్టమేనని హెచ్చరించారు. పార్టీ అధిష్టానం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భరణికాన సాయినాధరావు, గండి ముత్యాలనాయుడు, పిబివిఎస్.ఎన్.రాజు, కోటాన అప్పారావు, కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, దొడ్డి సూర్య ప్రకాష్, రేసుపూడి రమణ, గవర సత్యనారాయణ, బర్ల రమణ, పెద్దాడ రమణమ్మ, కోన సోమేశ్వరరావు, అక్కిరెడ్డి దుర్గినాయుడు, పైడివాడ ఎంపిటిసి ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.

భూ హక్కులు కోల్పోతున్న రైతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022 (ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల చట్టం-2022) ప్రజల పాలిట యమపాశం కాబోతుందని టిడిపి అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం వల్ల రైతులు తమ భూ హక్కులు కోల్పోతున్నారన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం నోబుల్ చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత 75 ఏళ్లగా పాటు సేవలు చేసిన రిజిస్ట్రేషన్, రెవెన్యూ, న్యాయ వ్యవస్థలు ఇక ముందు మూతపడనున్నాయని తెలిపారు. ఈ చట్టం ప్రకారం భూ ప్రాధికార సంస్థ, టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి నియమితమైన తరువాత ప్రజల స్థిరాస్తులన్నీ టిఆర్వో పరిధిలోకి పోతాయని, తద్వారా ప్రజలు తమ భూమి హక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు ప్రకటించారని తెలిపారు.

అడ్వాన్స్ నగదు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి-చోడవరం : దేవాదాయ శాఖ వేలంపాట ద్వారా అద్దెకు ఇచ్చే షాపులకు తాము కట్టిన అడ్వాన్స్ నగదును తమకు ఇప్పించాలని చోడవరానికి ఉప్పల గణ నూకరాజు (ఉప్పల బాబు). సుంకరి సత్యనారాయణ, ఉప్పల వెంకటేష్, సిరసపల్లి శ్రీనివాస్ గురువారం స్థానిక దేవాదాయ శాఖ అధికారి సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నెలల క్రితం చోడవరం హార్డింగ్ రెస్ట్ హౌస్‌లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దుకాణాలకు పబ్లిక్ వేలం వేయగా, తాము షాపుల నిమిత్తం ఒక్కొక్కరం రూ.2.50లక్షల చొప్పున అడ్వాన్స్ కట్టామని చెప్పారు. ఇప్పటివరకు షాపుల నిర్మాణం జరగలేదని, దీనిపై దేవాదాయ శాఖ ఈవో సరైన సమాధానం చెప్పలేదని వారు వాపోయారు. ఫైనాన్సర్ల వద్ద అప్పులు చేసి నగదు చెల్లించామని, వాటికి వడ్డీ రూపంలో ఇప్పటివరకు వేలాది రూపాయలు చెల్లించామని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే తాము చెల్లించిన నగదు వెనక్కి తిరిగి ఇవ్వాలని కోరారు.



బాలుడి మృతదేహం

నీళ్ల తొట్టిలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని వాలాబు శివారు కోడపల్లిలో ఏడాదిన్నర బాలుడు ప్రమాదవశాత్తు నీళ్ల తొట్టిలో పడి గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన చెరుకు చంద్రరావు, జానకి దంపతుల రెండో కుమారుడు చెరుకు గణేష్ (ఏడాదిన్నర బాలుడు) గురువారం మధ్యాహ్నం ఇంటి బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు ఇంటి పని చేసుకుంటున్నారు. కొద్ది సేపటి తరువాత ఆరు బయట ఆడుతున్న కుమారుడు కనిపించలేదు. దీంతో భార్యా భర్తలు బయటకు వచ్చి చూడగా గణేష్ నీళ్ల తొట్టిలో మునిగిపోయి ఉండటాన్ని గమనించారు. వెంటనే బయటకు తీసి ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. స్టాఫ్ నర్సు రాణితో పాటు వైద్య సహాయకురాలు శిరీష కలిసి ఆ బాలుడికి వైద్యం చెయ్యడానికి ప్రయత్నించారు. అయితే పరిస్థితి విషమించి ఆ బాలుడు మృతి చెందాడు. ఆ తరువాత వచ్చిన 108 సిబ్బంది సైతం బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మధ్యాహ్నం వరకు తమ కళ్ల ముందే ఆడుతూ కనిపించిన చిన్న కొడుకు క్షణాల్లో విగత జీవిగా మారిపోవడాన్ని చూసిన ఈ గిరిజన దంపతులు బోరున విలపించారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో పాత కన్నూరుపాలెం గ్రామంలో శ్రీముత్యాలమ్మ తల్లి పండుగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ సిరపరపు శివ, ఉప సర్పంచ్ కర్రి అప్పారావు, కన్నూరి అప్పలనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తాం

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆన్‌లైన్ వేదికపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కెవి మురళీకృష్ణ హెచ్చరించారు. వాట్సాప్, టెలిగ్రాం, ఫేస్ బుక్ గ్రూపుల్లో అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అభ్యంతరకర, తప్పుడు వార్త, వదంతులపై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. విద్వేషాలు రెచ్చగొట్టేవి, తప్పుడు సమాచారం, తెలియని సమాచారం, వర్గపోరుకు దారి తీసేవి, మార్ఫింగ్ ఫోటోలు, తప్పుదారి పట్టించే సమాచారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9440904229కు (సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది.) సమాచారం అందించాలని కోరారు. అనకాపల్లి జిల్లా పోలీసు వారిని సోషల్ మీడియా సామాజిక మాధ్యమాలలో సంప్రదించడానికి
https://twitter.com/AKPPolice/
https://www.facebook.com/anakapallidistrictpolice/
https://www.instagram.com/anakapallidistrictpolice/
https://whatsapp.com/channel/0029VaPd1DQFsn0mOsuj2V1b
పైవాటిని అనుసరించాలని కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అనకాపల్లి జిల్లా పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్యానికి పొగ

-గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం కాల్చివేత
-అవస్థలు పడుతున్న వాహనదారులు, స్థానికులు
-వృథాగా సంపద సృష్టి కేంద్రాలు


రామన్నపాలెం ప్రధాన రహదారిపై తగలబెడుతున్న చెత్తతో కమ్మిన పొగ

ప్రజాశక్తి - కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో పారిశుద్ధ్యంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను గ్రామ శివారులో విచక్షణ రహితంగా తగల బెట్టడంతో ప్రజారోగ్యానికి పొగ పెడుతున్నారు. నిత్యం జరిగే ప్రక్రియ అయినా సమీప ప్రాంతవాసులతో పాటు రహదారిపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంపద సృష్టి కేంద్రాలకు ఉపాధి నిధులను ఖర్చుపెట్టినా వాటిని వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో నిధులు వృథా కావడమే కాకుండా పలుచోట్ల నిర్మించిన సంపద కేంద్రాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారిని ఆనుకుని తగలబెడుతున్న చెత్త కారణంగా పర్యావరణం దెబ్బతినడమే కాకుండా వెలువడుతున్న పొగ కారణంగా తీవ్ర అనారోగ్య పరిస్థితి నెలకుంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తగల బెడుతున్న చెత్తలో ఉన్న మద్యం బాటిళ్లు వేడి కారణంగా పేలడంతో దారిన పోయే వారు భయాందోళన చెందుతున్నారు.

స్వచ్ఛభారత్, స్వచ్ఛ సంకల్పం అంటూ ప్రభుత్వాలు ప్రచారాలతో ఊదరగొడుతున్నా వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించిన దాఖలాలు లేవు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు, ప్రయాణికులు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామంలోని కూలీలతో మాట్లాడుతూ, జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి పనుల్లోకి రావాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా కూలీలందరూ ఉదయాన్నే తొందరగా పనికి వెళ్లి పూర్తి చేసుకుని ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రభుత్వం కూలీకి నిర్దేశించిన రూ.272 కూలి వేతనాన్ని పొందే విధంగా పనులను చేయాలన్నారు. కూలి పనికి వేరే ప్రాంతాలకు వెళ్లకుండా మన గ్రామంలోనే ఉపాధి హామీ పథకం ద్వారా పనులను కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పనులను చేపట్టడంతో మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు రైతుల వ్యక్తిగత పనులను కూడా ఈ పథకం ద్వారా చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ డివి స్వామి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం, డిఎస్పీ మోహన్ సూచించారు. గురువారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమించిన ఐదు కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్‌టి), మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసిపి), వీడియో సర్వే లైన్స్ టీం (వివిఎస్ టి), అకౌంటింగ్ టీం(ఏటి) అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ (ఏఇఓ) టీములకు దిశా నిర్దేశం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

అనకాపల్లిడెస్క్: ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు అందురు సహకరించాలని గొలుగొండ ఎస్సై కృష్ణారావు, కృష్ణదేవిపేట ఎస్సై ఉపేంద్ర కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. ఏ రాజకీయ పార్టీ తరపున ప్రచారం చేయకూడదని చెప్పారు. ఇప్పటికే కొంతమంది పై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసినా గొడవలకు, రెచ్చగొట్టే మాటలు మాట్లాడిన వెంటనే పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ ఎవరు అతిక్రమించిన చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే క్రిమినల్ కేసులు తప్పవన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 10వ వార్డు తెలుగుదేశం పార్టీకి చెందిన 26 కుటుంబాలు గురువారం వైసీపీలో చేరాయి. ఈ సందర్భంగా నర్సీపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీరందరికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వైసీపీ కండువాలవేసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు వైసీపీ నాయకులు చీటీల రాము, రాధాకృష్ణ, టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -కొత్తకోట: తేనెటీగల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయలైన సంఘటన గురువారం మేడివాడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బండారు గోవింద్ చింత బొట్టల కోసం మెయిన్ రోడ్డు సమీపంలో సెల్ టవర్ పక్కన వున్న చింతచెట్టు ఎక్కాడు. చెట్టుపై వున్న తేనెటీగలు ఒక్కసారిగా గోవిందపై దాడి చేసాయి. గాయాలపాలైన గోవింద్‌ను స్థానికులు చెట్టుపై నుంచి దించి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ

పాఠశాలల్లో ఎనర్జీ క్లబ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థు లకు ఇంధన సామర్థ్యం, పొదుపు కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి ఎనర్జీ క్లబ్‌లు ఏర్పాటు చేశామని ఎంఈఓ కె.నరేష్ తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో ఎనర్జీ క్లబ్ ఏర్పాటులో భాగంగా గురువారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించారు. వీటిని పరిశీలించిన ఎంఈఓ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ఇంధన సామర్థ్యం, పొదుపు పై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎనర్జీ క్లబ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. వాతావరణంలో మార్పులు, గ్లోబల్ వార్మింగ్‌తో కరువు సంభవించడం వంటి సమస్యలకు పరిష్కారాలను అన్వేషించడం ఎనర్జీ క్లబ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

పథకాలపై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి - మాడుగుల: తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి పార్టీ అనేక ఎత్తుగడలు వేస్తూ నాయకులు, కార్యకర్తల మధ్యన చిచ్చుపెట్టేందుకు చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షుడు రంజిత్ వర్మ, మండల పార్టీ అధ్యక్షులు అద్దెపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, క్లస్టర్ ఇన్చార్జి పుప్పాల రమేష్ పాల్గొన్నారు.


మాడుగులలో మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

చీడికాడ: గ్రామాల్లో బిజెపి, తెలుగుదేశం, జనసేన కూటమి మేనిఫెస్టోను వివరించాలని భారతీయ జనతా మండల పార్టీ అధ్యక్షులు పరవాడ మురళి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మురళి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మురళి మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండల ఎన్నికల సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జ్ మేడపరెడ్డి శ్రీనివాస్, పుట్ట మల్లికార్జున్, శివాజీ రాజ్, రెడ్డి కొండబాబు, కొల్లి సూర్యప్రకాష్‌రావు, సన్నిబాబు పాల్గొన్నారు.

అయ్యన్న గెలుపునకు కృషి

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: ఎన్డీయే కూటమిలో భాగంగా అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపుకై కృషి చేస్తామని బిజెపి నాయకులు అన్నారు. మాజీ మంత్రి, నర్సీపట్నం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడును గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బిజేపి పార్లమెంట్ కన్వీనర్ బివిఎస్ వర్మ మాట్లాడుతూ, వైసీపీ నిరంకుశ పాలనపై ప్రజలు, ఉద్యోగులు తీవ్ర అసహనంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

22న మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: ఈ నెల 22న గొలుగొండ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డిఎస్.రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరిగే సాధారణ సమావేశంలో పలు అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లతో పాటు ఈ సమావేశానికి మండలశాఖ అధికారులు హాజరు కావాలని ఆమె అన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

ఓటు హక్కుపై ర్యాలీ

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో గురువారం ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఖచ్చితంగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపిఎం మంగ మాట్లాడుతూ, 85 సంవత్సరాల నుండి వృద్ధులందరికీ ఇంటి నుండి ఓటు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ కొండబాబు, ఐకెపి సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డిఒతో మాట్లాడుతున్న అయ్యన్న

ఆర్డిఒను కలిసిన అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం నియోజవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాంను మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం కలిశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని, అందులో భాగంగా ఎలక్షన్ కమిషన్ కొన్ని కొత్త రూల్స్ ఇచ్చారని, వాటిని అన్ని పార్టీల వారికి ఇవ్వాలన్నారు. టిడ్కో ఇళ్లకు పార్టీ రంగులు వేసారని వాటిని వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలక్షన్ కమిషన్ గతంలోని మైక్ ఫర్మిషన్ 30 రోజులకు ఒకసారి ఇచ్చేవారని, ఇప్పుడు పర్మిషన్ ఏ రోజుకు ఆ రోజు తీసుకోవాలంటున్నారని, దాన్ని ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి, 30 రోజులకు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. ప్రతి గ్రామంలోకి వెళ్ళినప్పుడు లోకల్ పోలీస్‌ల పర్మిషన్‌కు అప్లై చేస్తే సరిపోయేదని, దీన్ని మార్చి ఆర్డీవోకి, జిల్లా ఎస్పీకి పర్మిషన్ కోసం అప్లై చేయాలంటున్నారని, అది కూడా ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి సరి చేయాలని ఆయన కోరారు. వాలంటీర్స్ కొంతమంది ఇంకా ఎలక్షన్ విధుల్లో పాల్గొంటున్నారని, వారి వీడియోలు, ఫోటోలు సంబంధిత అధికారులకు ఇవ్వడం జరుగుతుందని, వారిని వెంటనే ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని ఆయన కోరారు.



తరలి వచ్చిన భక్తులు

వైభవంగా వెంకన్న కల్యాణం

ప్రజాశక్తి- నక్కపల్లి:ఉపమాకలో వెంకన్న కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణతో ఘనంగా జరిగింది. వెంకన్న వార్షిక తిరు కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ కల్యాణవేదిక వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, నర్సింహాచార్యుల అర్చక బృందం అంగరంగ వైభవంగా జరిపించారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభమైన వేడుక గురువారం తెల్లవారుజాము వరకు జరిగింది. కల్యాణం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణమంతా కిటకిట లాడింది.తెలుగు పండితురాలు గాయత్రి దేవి పెండ్లి మాటలను భక్తులకు వివరించారు.అనంతరం తిరువీధిలో రథోత్సవం చేపట్టారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి-చీడికాడ:రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణరావు మాట్లాడుతూ, కేంద్ర పోలీసులు దిబ్బపాలెం, తునివలస, వరహాపురం, కోణం, ఖండివరం, అప్పలరాజు పురం, బోయ పాడు, జైతవరం గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారన్నారు. ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై తెలిపారు.



కవాతు చేస్తున్న పోలీసులు

అడుగడుగునా..ఎన్నికల కోడ్ ఉల్లంఘన


నేతల ఫొటోలకు వేయని ముసుగులు

పట్టించుకోని అధికారులు



వెంకటాపురం రైతు భరోసా కేంద్రంపై సిఎం జగన్ పోటో

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలోని పలు గ్రామాల్లో అడుగడుగున ఎన్నికల ఉల్లంఘనలు జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్నా నేటికీ కొన్ని గ్రామాలలో పలు శాఖల అధికారులు మొద్దు నిద్రను వీడలేదు. మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, శిలాఫలకాలపై అధికార పార్టీ నాయకుల పొటొలకు ముసుగులు వేయలేదు. పార్టీ సింబల్ సంబంధించిన రంగులు కూడా నేటికీ తొలగించకపోవడం గమనార్హం.మరీ ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా అని పలు పార్టీల, సంఘాల నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



నీలిగుంట గ్రామంలో శిలాఫలకంపై సిఎం, ఎమ్మెల్యేల ఫోటోలు

మండలంలో జనాభా సంఖ్యతో పోల్చుకుంటే రెండవ అతిపెద్ద గ్రామం వెంకటాపురం రైతు భరోసా కేంద్రం పై ఉన్న నవరత్నాల సింబల్‌ను సైతం నేటికీ మూసి వేయలేదు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతుంది. అదేవిధంగా నీలిగుంట గ్రామంలో అధికార పార్టీ నాయకుల ఫోటోలతో పాటు అభివృద్ధి పనుల శిలాఫలకంపై ముసుగు వేయకపోవడం తో పాటు మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో వైయస్సార్ జెండా రంగులతో నిండి ఉన్న ఉన్న సిమెంట్ బెంచీలు పాములవాక, పీకే పల్లి గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల మేరకు తొలగించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నీలి గుంట గ్రామంలో విగ్రహం వద్ద వైసిపి రంగులు

అధికారులు స్పందించి నేతల ఫొటొలకు ముసుగులు వేయాలని పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోనూ అంతే?

కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రధాన రహదారిని అనుకుని ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కూడా ఎన్నికల కోడ్ జాడ కానరాలేదు. అధికార పార్టీ పార్టీ కార్యాలయంలా వాడుకుంటున్న వైనం పట్ల మండలంలో వివిధ పార్టీ నాయకులు, ప్రజలు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. కార్యాలయంలో మాజీ సిఎం రాజశేఖర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సూర్యనారాయణరాజు ఫోటోలు అలాగే ఉన్నాయి. కార్యాలయం ఆవరణలో ఇటీవల తొలగించిన మండల వైసీపీ నాయకుల ఫ్లెక్సీలు ఉంచడంతో పాటు సహకార సంఘం పేరు కూడా వైసిపి రంగులతో ఉండటం విశేషం. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా వ్యవసాయ సంఘ కార్యాలయ అధికారులు స్పందించక పోవడం గమనార్హం.



వైసిపి రంగులతో ఉన్న సహకార సంఘం కార్యాలయం

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రజల పక్షాన ఉంటూ సమస్యలపై పోరాడే సిపిఎం బలపరిచిన అరకు పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో. సురేంద్ర పిలుపునిచ్చారు.గురువారం అనంతగిరి మండల సిపిఎం కార్యకర్తల విస్తతస్థాయి సమావేశం గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశాం సీపీఎం టోకురు సర్పంచ్ కిల్లో మొస్య అద్యక్షతన జరిగింది ఈ సమవేశంలో సురేంద్ర మాట్లాడుతూ, ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, చట్టాలు రక్షణకై నిరంతరం పని చేస్తున్న సిపిఎం అభ్యర్థులకే ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం అనేక పోరాటాలు నిర్వహించిందని చెప్పారు. సాగులో ఉన్న రైతులకు పోడు భూమి పట్టాలు పంపిణీ చేయాలని అనేక అనేక పోరాటాలు చేసి సాధించడం జరిగిందన్నారు. మంచినీరు, రోడ్డు గిరిజనులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి విభజించు పాలి పాలించు అనే రీతిలో బిజెపి ప్రభుత్వం దేశంలో పాలిస్తుందనానరు. బిజెపితో భవిష్యత్తులో ముప్పు ఉందని విమర్శించారు. సీపీఎం జెడ్పీటీసీ దీసరి. గంగరాజు



మాట్లాడుతున్న సురేంద్ర

మాట్లాడుతూ, గ్రామాలలో రోడ్లు, తాగునీరు, ఇతర సమస్యల పరిష్కారనికి కృషి చేస్తున్నానన్నారు. పాడేరు కనెక్టివిటీ కింద మండలంలోని రాజుపాక నుండి డెక్కపురం, చీడివలస నుండి బొంగిజా, మెట్టువలస నుండి ఓనుకొండ, గుమ్మ నుండి కడారేవు, జెండా గరువు నుండి ఊటగెడ్డ, బొడ్డపాడు నుండి పుట్టపాడు మరికొన్ని గ్రామాల రోడ్లకు 2 కోట్ల 50 లక్షల నుండి మూడు కోట్లు నిదులతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు, కార్యకర్తలు దేవన్న, సింగులు, కృష్ణ, దేవుడమ్మ, కాసులమ్మ, దేవి, అనకాపల్లి జిల్లా నాన్ షెడ్యూల్ పంచాయతీ గిరిజన సంఘం కార్యదర్శి వైకె దొర, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

రూ.2 లక్షలా 70 వేల నగదు సీజ్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం రాత్రి పాడేరు వంతాడపల్లి చెక్పోస్ట్ వద్ద పోలీస్ తనిఖీలు నిర్వహించారు. 50 వేలకు మించి నగదు తో ప్రయాణిస్తున్న వ్యక్తులను తనిఖీలు చేసి వారి నుంచి నగదు స్వాధీనపరచుకొని సీజ్ చేస్తున్నారు. ఈ మేరకు మైదాన ప్రాంతం నుండి పాడేరుకు ద్విచక్ర వాహనం లో సరైన పత్రాలు లేకుండా 2,70,000 నగదు తో వస్తుండగా పోలీస్ తనిఖీల్లో ఒక వ్యక్తి నుంచి ఈ సొమ్మును స్వాధీనం పరుచుకుని సీజ్ చేశారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

నాంది ఫౌండేషన్ బృందం పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని గురగరువు గ్రామాన్ని నాంది ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం సందర్శించారు. బెస్ట్ విలేజ్ బెస్ట్ ఫార్మర్ ఎంపికలో భాగంగా పరిశీలనకు ఈ నాంది ప్రతినిధి బృందం ఈ గ్రామంలో పర్యటించింది. ఈ గ్రామానికి చెందిన గిరిజన కాఫీ రైతుల సంఘం జాతీయ సభ్యుడు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు పాలికి లక్కు నాంది ప్రతినిధులకు పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో కాఫీ సాగు చేపడుతున్న సాగు విస్తీర్ణం, దిగుబడి, తదితర విషయాలను లక్కు వారికి వివరించారు.



స్వాగతం పలుకుతున్న లక్కు